బీజేపీ ఆఫీస్ ప్రారంభం







గాజులరామారంలోని బాలాజీ లేఅవుట్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ కార్యాలయం ప్రారంభోత్సవం, మహాజన సంపర్క్ అభియాన్ పేరిట నిర్వహించిన బహిరంగ సభ బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. సాయంత్రం 5 గంటలకు జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌లు హాజరై ముందుగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి జెండాను ఎగురవేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మేడ్చల్ అర్బన్, రూరల్ జిల్లాల అధ్యక్షులు విక్రమ్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, బీజేపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్



కార్యకర్తల్లో ఉత్సాహం

క్లుప్తంగా

పుస్తె, మెట్టెల అందజేత

దుండిగల్: నిరు పేద ఆడబిడ్డలను ఆదుకునేందుకు ముందుటామని మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేశ్ అన్నారు. దుండిగల్ 5వ వార్డు ప్రాంతానికి చెందిన నిరుదు శంకరయ్య, రాజమణి కుమార్తె వివాహానికి ఆయన పుస్తె, మెట్టెలను అందజేశారు. 2వ వార్డు కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో కుమ్మరి సదానందం, దారసింగ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ శిబిరం

సుభాష్‌నగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న ఉచితంగా యోగా నేర్పించనున్నట్లు యోగా గురువు రవీందర్ రాజు పేర్కొన్నారు. శివోహం యోగ రీసెర్చ్ సెంటర్, సుచిత్ర వారి ఆధ్వర్యంలో బుధవారం నుంచి వారం రోజులపాటు జీడిమెట్ల విలేజ్‌లోని సరోజిని గార్డెన్‌లో ఉదయం 6 నుంచి 7 వరకు ఈ యోగా శిబిరం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని సుచిత్ర చౌరస్తాలో 500 మందితో యోగా కార్యక్రమం నిర్వహించి ప్రాముఖ్యతను తెలియజేయునట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 93963 78418 కు సంప్రదించాలని కోరారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

నిజాంపేట్: మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నానని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరందర్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిదిలోని ఎస్‌జేబీ హిల్స్‌లో జరుగుతున్న సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఆయన వెంట కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

పట్టణ ప్రగతి, హరిత దినోత్సవం విజయవంతం చేయాలి

నిజాంపేట్: తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవాన్ని, తెలంగాణ హరిత దినోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లడుతూ.. ఈ నెల 16న పట్టణ ప్రగతి దినోత్సవం, 19న హరితోత్సవాలను నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు.ఈ సమావేశంలో ఆయా అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



రవీంద్రనాయక్ (ఫైల్)

నిజాంపేట్: ప్రమాదవశాత్తు ఓ సెంట్రింగ్ కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం చిట్కూల్ భద్రయ్య తాండకు చెందిన రవీంద్రనాయక్(36) బతుకుదెరువు నిమిత్తం బాచుపల్లిలోని సాయినగర్‌లో నివాసం ఏర్పాటు చేసుకుని సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సాయినగర్‌లో స్వామి అనే వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం సెంట్రింగ్ పనులు చేస్తున్నారు. దీంతో బుధవారం మధ్యాహ్నం సమయంలో సెంట్రింగ్ కర్రలు ఇప్పుకుని తీసుకువెళ్లడానికి రవీంద్రనాయక్ అక్కడ కర్రలు తొలగిస్తున్నాడు. దీం పనులు చేస్తున్నాడు. దీంతో రవీంద్రనాయక్ మృతితో సాయినగర్‌లో విషాదఛాయలు అలముకున్నాయి.

ఏమరపాటుతో ప్రమాదం....

బుధవారం తాను సెంట్రింగ్ పనులు చేస్తున్న భవనం దగ్గరకు వచ్చి కర్రలు, స్లాబ్ పక్కలకు సెంట్రింగ్ డబ్బలకు కట్టిన రాడ్‌లను తొలగిస్తున్నాడు. ఈభవనం పక్కనే సుమారు మూడు ఫీట్ల దూరంలోనే11 కేవీ విద్యుత్ లైన్ తీగలు ఉన్నాయి. ఈ క్రమంలో రవీంద్రనాయక్ ఆ డబ్బాలకు ఉన్న రాడ్‌లను వెనుకకు లాగడంతో తన వెనుక ఉన్న విద్యుత్ తీగలకు రాడ్ తగిలింది. దీంతో షాక్ తగిలి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే అతడు ప్రాణాలు వదిలాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి ఫోకస్

ఒక్కటే.. గది ఒక్కరే! టీచర్

ఈ పరిస్థితి ఎన్ని పాఠశాలల్లో ఉందో?



వినాయక నగర్ పాఠశాలలో నేలపైనే విద్యార్థుల చదువు



మహేశ్వరంలోని ప్రాథమిక పాఠశాల

దుండిగల్: ఒకే ఒక్క ఉపాధ్యాయుడు.. ఒక్కటే తరగతి గది.. కానీ అందులో మాత్రం ఒకటి నుంచి 5వ తరగతి వరకు 50 మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. జ్వరమో.. మంచో.. చెడో.. ఇతర కారణాలతో ఆ సారు లీవ్ పెడితే ఇక ఆ రోజు స్కూల్ మూత పడాల్సిందే. విద్యార్థి ఉపాధ్యాయుడు చెప్పే పాఠశాలను శ్రద్ధగా విని అర్థం చేసుకుని చదువుకుంటునే పరీక్షల్లో పాస్ అవుతాడు. కాని ఇక్కడ విచిత్రమేమిటంటే.. ఒకటో తరగతి విద్యార్థి తన పాఠాలతో పాటు 2 నుంచి 5వ తరగతి పాఠాలు, 2వ తరగతి విద్యార్థి 1, 3,4,5 తరగుతుల పాఠాలు, ఇలా తన విద్యా సంవత్సరంతో పాటు మిగిలిన తరగతుల పాఠాలను ప్రతి రోజు వింటున్నాడు. తీరా పరీక్షలు వచ్చే సమయానికి విద్యార్థి మానసిక సంఘర్షణకు గురవుతున్నాడు. ఇది కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాథమిక పాఠశాలల దుస్థితి.

ఒకే గదిలో 1 నుంచి 5వ తరగతి వరకు

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండిమైసమ్మ–దుండిగల్ మండలంలోని మహేశ్వరంలో ఒకే తరగతి గదిలో 1 నుంచి 5వ తరగతి కొనసాగుతుంది. ఇందులో మొత్తం 48 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడు.

రెండు గదుల్లో 76మంది విద్యార్థులు

- శంభీపూర్‌లో మూడు తరగతి గదులు ఉండగా ఒకటి వంట గది, రెండు తరగతి గదులు ఉన్నాయి. ఇక్కడ 76 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడా ఒక్కడే ఉపాధ్యాయుడు.

50 విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు

- నాగులూరులోనూ రెండు తరగతి గదుల్లో 50 మంది విద్యార్థులు ఉండగా ఇక్కడా ఒక్కడే ఉపాధ్యాయుడు. దీంతో పాటు కొంపల్లిలోని ఉమామహేశ్వర కాలనీ, కుత్బుల్లాపూర్ సర్కిల్‌లోని వినాయక నగర్, గుడెన్‌మెట్, కళావతీనగర్, లాల్ సాహెబ్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలది ఇదే పరిస్థితి.

అన్ని సబ్జెక్టులు ఒకే ఉపాధ్యాయుడే..

- 1, 2 తరగతుల్లో మూడు, 3, 4, 5 తరగతుల్లో 4 చొప్పున ఒకటి నుంచి 5వ తరగతి వరకు మొత్తం 18 సబ్జెక్టులు ఉంటాయి. అయితే ప్రతి రోజు ఒకే ఉపాధ్యాయుడు 5 తరగతులకు 18 సబ్జెక్టులను బోధించాలి.
- పాఠశాల ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. ఇంటర్వెల్, మధ్యాహ్న భోజనానికి ఒక గంట మినహాయిస్తే 6 గంటలు క్లాసులు ఉంటాయి.
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి రోజు ఒక్కో తరగతికి తెలుగు సబ్జెక్టుకు గంటన్నర, మ్యాథ్స్‌కు గంటన్నర, ఇంగ్లీష్‌కు 45 నిమిషాలు, ఈవీఎస్‌కు 45 నిమిషాలు, లైబ్రరీకి గంట సమయం కేటాయించాలి.
- ఇలా చూసుకుంటే ఉపాధ్యాయుడు రోజంతా ఒకే తరగతికి పాఠాలు బోధించాలి. కానీ ఇక్కడ 5 తరగతులకు సదరు ఉపాధ్యాయుడే పాఠాలు బోధిస్తున్నాడు. అది ఎలా సాధ్యపడుతుంది.?
- గంటన్నర సమయాన్ని కేవలం 10 నుంచి 15 నిమిషాలకే కేటాయించడం, ఒక్కో సారి పూర్తి సిలబస్ కాకపోవడం, నాణ్యమైన విద్యను అందించకపోవడం జరుగుతుంది.

వేధిస్తున్న గదుల కొరత..

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్, కుత్బుల్లాపూర్, బాచుపల్లి మండలాల్లో మొత్తం 107 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 85 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, 21 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో 50 శాతానికి పైగా పాఠశాలల్లో గదుల కొరత తీవ్రంగా ఉంది.
- ప్రాథమిక పాఠశాలలకు 5 గదులు, వంట గది, ఆఫీస్ రూమ్, స్టాఫ్ రూమ్‌లు ఉండాలి. కొన్ని మినహా మెజార్టీ పాఠశాలల్లో కేవలం రెండు, మూడు గదుల్లోనే సర్దుకుపోతున్నారు.
- ఒక తరగతి గదిలో 1:40 నిష్పత్తి ఉండగా కుత్బుల్లాపూర్, గురుమూర్తి నగర్ లాంటి పాఠశాలల్లో ఒకే గదిలో రెట్టింపు మంది విద్యార్థులు ఉన్నారు.

కంపుకొడుతున్న మూత్రశాలలు..

- మూత్రశాలల నిర్వహణ లేక తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. ముఖ్యంగా బాలికలు, మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలను శుభ్రం చేసే స్కావేంజర్లు లేక పోవడంతో కంపు కొడుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయిస్తుండగా మిగిలిన పాఠశాలల దుస్థితి ఘోరంగా ఉంది.



ఒకే గదిలో 5 తరగతుల విద్యార్థులు

కేంద్ర, రాష్ట్రాల్లో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయం



జీడిమెట్లలో ప్రచారం చేస్తున్న రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లారెడ్డి మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్: కేంద్ర, రాష్ట్రాల్లో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లారెడ్డి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాల పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం మహా జన సంపర్క్ అభియాన్‌లో భాగంగా జీడిమెట్ల డివిజన్‌లో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు గారిగే శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, సీనియర్ నాయకులు ఎంఎస్ వాసు, డివిజన్ల అధ్యక్షులు పులి బలరామ్, శ్రీరాములు, డివిజనల్ జనరల్ సెక్రటరీ రమేష్, భీమరాజు, బీజేవైఎం రాష్ట్ర నాయకులు కేశవ్ యాదవ్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కట్టాకుమార్, అసెంబ్లీ ఓబీసీ మోర్చా కన్వీనర్ శ్రీధర్ వర్మ, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ సతీష్ ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

కుత్బుల్లాపూర్: ఆలయాలు ఆధ్యాత్మికకు నెలవులని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధి అయోధ్యనగర్‌లో నూనతంగా నిర్మించిన శ్రీగోవిందమాంబ సమేత శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భరతసింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విరాట్ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి కృష్ణమాచారి, పురుషోత్తం, జ్ఞానేశ్వర్, జనార్దనాచారి, అరుణ్‌కుమార్, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, సందీప్‌గౌడ్, అంజయ్య, అబిద్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో బీజేపీ నేత భరతసింహారెడ్డి

ఐకమత్యంతో అభివృద్ధి కాలనీలు చేసుకోవాలి



నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: సంక్షేమ సంఘాలు ఐకమత్యంతో అభివృద్ధి పనులు చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీ నూతన కమిటీ సభ్యులు బుధవారం శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఏర్వ సాయికిరణ్(బంటి), ప్రధాన కార్యదర్శి సాయిబాబా, కోశాధికారి షేక్ శ్రీను బాషా, సభ్యులు ఉన్నారు. అదే విధంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలను వివరించారు. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

విధిగా మొక్కలు నాటాలి

దుండిగల్: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా తన జన్మదినాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో బుధవారం ఆమె మొక్కను నాటారు. హరితాహారం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, మహేందర్ యాదవ్, సాయిబాబా యాదవ్, మాదాసు వెంకటేశం, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బహదూర్‌పల్లి సాయినాథ్ సొసైటీలోని సాయిబాబా, శివాలయాల్లో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మొక్క నాటుతున్న చైర్ పర్సన్ కృష్ణవేణి

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



బాచుపల్లి జడ్పీహెచ్ఎస్‌లో పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ కాసాని సుధాకర్

నిజాంపేట్: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌స్థాయి విద్యను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని నిజాంపేట్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం బాచుపల్లి జడ్పీహెచ్ఎస్, ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా డ్రెస్‌లు, పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనాన్ని కల్పిస్తున్నామని అన్నారు ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో బోధన జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బసప్ప, పద్మజారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కొలన్ బాల్‌రెడ్డి, బసవ శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే యూత్ కమిషన్లను ఏర్పాటు చేస్తాం

నిజాంపేట్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే యూత్ కమిషన్లను ఏర్పాటు చేసి రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలను అందిస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం ఇందిరమ్మ కాలనీలో ఆయన పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ ప్రజలు మోసం చేశాయన్నారు. ఈసారి ఓట్లను అడిగేందుకు వచ్చే అధికార పార్టీ నాయకులను ప్రజలు ప్రశ్నించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పెద్దపీట వేస్తామని తెలిపారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం యాదవ్, జీతయ్య, శంకర్, మధుసూదన్‌రెడ్డి, అంజాద్, కొలన్ జీవన్‌రెడ్డి, అమృతయ్య, కొలన్ సత్తిరెడ్డి, వీర బాబు, మహేష్, గొంగుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీలో ప్రచారం చేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్



ఉత్తమ సేవలందించిన వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకాంనంద్, వైద్యాధికారులు

రంగారెడ్డినగర్: వైద్య రంగానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ కార్పొరేట్ రంగానికి దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం ఐడీపీఎల్‌లోని వైఎంఎస్ ఫంక్షన్ హాలులో »తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవ«వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలను ప్రస్తుతించారు.

నేడు ఐదు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు..

- అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యులు దేవుళ్లతో సమానమని, కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలను సైతం లెక్క చెయ్యకుండా సేవలు అందించడం అభినందనీయం అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 2014కు ముందు రెండు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలుంటే నేడు ఐదుకు చేరాయని అన్నారు. అదే విధంగా నియోజకవర్గ వ్యాప్తంగా 19 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సైతం అధికారులు, వైద్య సిబ్బందిని పెంచామని తెలిపారు.

2091 మందికి కేసీఆర్ కిట్‌లు అందజేశాం..

ప్రస్తుత్తం 41 మంది మెడికల్ ఆఫీసర్లు, 25 మంది స్టాఫ్ నర్స్‌లు, 45 మంది సపోర్టింగ్ స్టాఫ్, ఆరుగురు ల్యాబ్ టెక్నీషియన్లు ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 3962 డెలివరీలు అయితే 2091 మందికి కేసీఆర్ కిట్‌లు అందజేశామని తెలిపారు. 102 వాహనాల ద్వారా అమ్మ ఒడి కింద 11028 లబ్ధిదారులకు రవాణా చేసేందుకు 6726 ట్రిప్పులు తీసుకెళ్లామన్నారు. అదే విధంగా 6500 ఎన్‌సీడీ డ్రగ్ కిట్‌లు పంపిణీ చేశామని తెలిపారు.

వైద్య సిబ్బందికి సన్మానం..

అదే విధంగా బస్తీ దవాఖానల ద్వారా ఇప్పటి వరకు 1,91,499 మందికి వైద్య సేవలు, టీడీఎస్ ద్వారా 28,797 బయోకెమికల్ మరియు పాథలాజికల్ పరిశోధనలు చేశామన్నారు. కంటి వెలుగు పథకం ద్వారా 2,28,330 స్క్రీనింగ్ మాత్రమే కాకుండా 73,574 మంది లబ్ధిదారులకు కంటిచూపును సరిచేయడానికి కళ్లద్దాలు అందించామన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఉత్తమ స్టాఫ్ నర్సులు, ఉత్తమ లాబ్ టెక్నీషియన్ లు, ఉత్తమ డాక్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఆనంద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల, సిడీపీఓ హెప్సీబా, డాక్టర్ నవనీత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మహదేవపురం వాసుల అభినందనలు

- గాజులరామారం డివిజన్ పరిధిలోని మహదేవపురంలో గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పర్మిషన్ సమస్య పరిష్కారమైన నేపథ్యంలో కాలనీవాసులు ఎమ్మెల్యే వివేకానంద్‌కు అభినందన సభ ఏర్పాటు చేశారు. మహదేవపురం సర్వే నం.329/4 నుంచి 329/10 వరకు నిషేధిత జాబితాలో ఉన్నందున కాలనీవాసులు ఇళ్ల నిర్మాణానికి అనుమతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా జిల్లా కలెక్టర్, జోనల్ కమిషనర్ దృష్టికి ఇళ్ల నిర్మాణాలకు అడ్డంకులు తొలగించారని ఎమ్మెల్యే మేలు మరువమని స్థానికులు పేర్కొన్నారు.